# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు
# పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** జిల్లా రహదారులపై ప్రమాదాలు జరగకుండా సమగ్రమైన రహదారి భద్రత ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కువ నిడివి కలిగిన జాతీయ రహదారులతో పాటు, ఆర్ అండ్ బీ, పంచాయతీ రహదారులు ఉన్నాయని తెలిపారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో రహదారి భద్రతపై జిల్లా స్థాయి

మిగతా 2 లో...






జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 17 | ఏప్రిల్ | 2025 ◆ పేజీలు :5



- పల్లెల్లో అక్కడక్కడ కనిపిస్తున్న వైనం
- పట్టణాల్లో కనుమరుగు!
- ప్రాణంతకాలుగా సెల్ టవర్ల తరంగాలు?
- అంతరించిపోతున్న పిచ్చుక జాతి
- పరిరక్షించుకోవాలంటున్న శాస్త్రజ్ఞులు

# పిచ్చుక... నీ జాడేక్కడ..?

◆ ఇల్లందు, ప్రజాజ్యోతి

పిచ్చుక.. ఒక చిన్న పక్షి.. శాఖహారి.. కొద్దిసేపు అలా చిన్న పిల్లల్లా మారిపోతే.. వాటి విన్యాసాలు (ఆటలు) బహు చూడముచ్చటగా ఉంటాయి. అలా ఎంతసేపైనా చూడాలనిపిస్తుంది. 90వ దశకం ప్రారంభం వరకు ఎక్కడపడితే అక్కడ వీటి కిచికిచలు వినబడేవి. పల్లెల్లో ఇంటికి వెళితే చుట్టుప్రక్కలన్నీ ఆ శబ్దాలే. ఇక ఇళ్లలో వీటి కోసం ప్రత్యేకంగా వరిపాట్లను మేతగా వేలాడదీసి కుటుంబాలు సంతోషపడేవి. రాను రాను ప్రజల జీవనశైలిలో వేగంగా సంతరించుకుంటున్న మార్పులు పిచ్చుకల మీద బ్రహ్మాస్త్రాలయ్యాయి. అందుకే ఆ కిచకిచలు దూరమయ్యాయి.

2 లో..






# అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు

- నేరసమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం క్రైమ్, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి నెలలో విధుల పట్ల అంకితభావంతో పనిచేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్లో ఉన్న కేసులు వివరాలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి బాధ్యతగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. క్రికెట్ బెట్టింగులు, ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణా ఇతర సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా

మిగతా 2 లో...



2 లో..

# ట్రంప్ నిర్ణయాలతో అమెరికా నుండి...
# తిరిగి వస్తున్న సాఫ్ట్‌వేర్లు

- ఇక్కడ పెరిగి పోనున్న నిరుద్యోగం
- డిగ్రీలు చదివి జాబ్ మేళాలో 10 నుండి 20 వేలు తీసుకుని ఉద్యోగాలు చేస్తున్న నిరుద్యోగులు
- ప్రభుత్వ ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- ఎస్సీ వర్గీకరణ ఆమోదంతో నిరుద్యోగులకు ఊరట
- జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్ పై నిరుద్యోగుల్లో చిగురుస్తున్న ఆశలు

అమెరికా అధ్యక్షులుగా ట్రంపు గెలిచిన తర్వాత ట్రంప్ తీసుకున్న నిర్ణయాల తో ఇక్కడ తెలుగు రాష్ట్రాల నుండి అమెరికాలో వివిధ ప్రదేశాలలో సాఫ్ట్వేర్లుగా పని చేస్తున్న ఉద్యోగులు, ఇతర పనులు చేస్తున్నవారు తిరిగి ఇండియాకు వెళ్లాల్సిందిగా ట్రంప్ ఆదేశాలు ఇవ్వడంతో అక్కడ పనిచేస్తున్న వారంతా తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరిగి మన ఇండియాలో ఎవరు ప్రాంతాల వారు వారి గూటికి చేరుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు అమెరికాలో వివిధ హోదాలలో పని చేసినవారు ఇక్కడకు రావడంతో స్థానికంగా తెలుగు రాష్ట్రాలలో డిగ్రీలు చదివి ఉద్యోగాలు లేక, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడక నిరుద్యోగ సమస్య ఇక్కడ తీవ్రంగా ఉన్న తరుణంలోనే అమెరికాలో పని చేసి స్థిరపడిన సాఫ్ట్వేర్లు వివిధ రకాలుగా పనిచేసిన వారంతా ఇక్కడకు వస్తుండడంతో స్థానిక నిరుద్యోగులకు వారి రాకతో తమకు ఇంకెక్కడ ఉద్యోగాలు వస్తాయని నిరాశ చెందుతుండడం కనిపిస్తుంది.

◆ కొత్తగూడెం కలెక్టరేట్, ప్రజాజ్యోతి



## అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు



(మొదటి పేజీ తరువాయి...)

సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులకు శిక్షపడేలా పనిచేయాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ కృషిచేయాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 100 నకు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని దొంగతనాల నివారణకై ప్రజలను అప్రమత్తం చేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలియజేశారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ప్రజలు సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ అప్రమత్తం చేయాలని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి అలసత్వం వహించారాదని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వ్యక్తులపై నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్, ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్ సీఐలు, ఎస్సైలు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రంప్ నిర్ణయాలతో అమెరికా నుండి తిరిగి వస్తున్న సాఫ్ట్వేర్లు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** నిన్న మొన్నటి వరకు అమెరికాలో వివిధ హోదాలలో పని చేసినవారు ఇక్కడకు రావడంతో స్థానికంగా తెలుగు రాష్ట్రాలలో డిగ్రీలు చదివి ఉద్యోగాలు లేక, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడక నిరుద్యోగ సమస్య ఇక్కడ తీవ్రంగా ఉన్న తరుణంలోనే అమెరికాలో పని చేసి స్థిరపడిన సాఫ్ట్వేర్లు వివిధ రకాలుగా పనిచేసిన వారంతా ఇక్కడకు వస్తుండడంతో స్థానిక నిరుద్యోగులకు వారి రాకతో తమకు ఇంకెక్కడ ఉద్యోగాలు వస్తాయని నిరాశ చెందుతుండడం కనిపిస్తుంది. ఇదిలా ఉండగా ఇటీవల అనేకమార్లు ప్రభుత్వం జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నోటిఫికేషన్ ఇవ్వడంతో డిగ్రీలతో పాటు, ఇంకా పై చదువులు చదివిన వారు కూడా జాబ్ మేళాకు వెళ్లి రూ 10 నుండి 20వేల రూపాయల వరకు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు చేస్తూ వాటినే సరిపెట్టుకుంటూ ముందుకు పోతున్నారు. గత ప్రభుత్వంలో కూడా సరైన ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడక నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతూ వస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఏమైనా ఉద్యోగ నోటిఫికేషన్ వస్తుందేమోనని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్ పై త్వరలో భారీ గా ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేస్తారని ఆశతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. అదే విధంగా ఇటీవల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పోరాటంతో ఎస్సీ వర్గీకరణ పోరాట నేపథ్యంలో వర్గీకరణ ఆమోదం పొందడంతో అన్ని ఉప కులాల వారికి ఉపయోగపడే విధంగా గ్రూపుల వారీగా ఉద్యోగాలు పొందేందుకు వీలుగా వర్గీకరణ రావడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయని చెప్పవచ్చు. ఇకపోతే ఉమ్మడి జిల్లాలో అనేక పరిశ్రమలు ఏర్పడితే స్థానిక నిరుద్యోగులకు మెరుగైన ఉద్యోగాలు వస్తాయని కొంతమంది నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురుచూస్తూ ఉన్నారు. నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అన్నివనరులు ఉన్న ఉమ్మడి జిల్లాలలో వివిధ ప్రాంతాలలో పరిశ్రమలను ఏర్పాటు చేసే విధంగా కేంద్ర, రాష్ట్రాల నుండి ప్రయత్నాలు చేస్తే నిరుద్యోగ సమస్య తగ్గడమే కాక అనేక కుటుంబాల పోషణకు బాటలు వేసిన వారవుతారని కొంతమంది నిరుద్యోగులు వాపోతున్నారు.

# పిచ్చుక నీ జాడేక్కడ!

**ఇల్లందు, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి:** పిచ్చుక.. ఒక చిన్న పక్షి.. శాఖహారి.. కొద్దిసేపు అలా చిన్న పిల్లల్లా మారిపోతే.. వాటి విన్యాసాలు (ఆటలు) బహు చూడముచ్చటగా ఉంటాయి. అలా ఎంతసేపైనా చూడాలనిపిస్తుంది. 90వ దశకం ప్రారంభం వరకు ఎక్కడపడితే అక్కడ వీటి కిచికిచలు వినబడేవి. పల్లెల్లో ఇంటికి వెళితే చుట్టుప్రక్కలన్నీ ఆ శబ్దాలే. ఇక ఇళ్లలో వీటి కోసం ప్రత్యేకంగా వరిపొట్లను మేతగా వేలాడదీసి కుటుంబాలు సంతోషపడేవి. రాను రాను ప్రజల జీవనశైలిలో వేగంగా సంతరించుకుంటున్న మార్పులు పిచ్చుకల మీద బ్రహ్మాస్త్రాలయ్యాయి. అందుకే ఆ కిచకిచలు దూరమయ్యాయి. ప్రపంచంలో దాదాపు 40 రకాల పిచ్చుకలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. పిచ్చుకలు సహజంగా 11 సెంటీమీటర్ల నుండి 16 సెంటీమీటర్ల పొడవు ఉంటాయి. బరువు పరిశీలిస్తే 15 గ్రాములు మొదలుకొని 42 గ్రాముల వరకు ఉంటాయని తెలుస్తుంది. పిచ్చుకలకు ఇళ్లలో గూడు కట్టుకోవాలనే అలవాటు ఉంది. అందుకే ఇవి ఇంటి నేస్తాలు అంటారు. పిల్లలు లేని ఇండ్లలో వీటి శబ్దాలే పెద్ద సందడి. అప్పుడప్పుడు కొంత చికాకు అనిపించినా ఆ సంతోషమే వేరు. ఎంత చిన్న ప్రాణి అయినా దాని అస్తిత్వం దానికి ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, దీని ద్వారా పర్యావరణ సమతుల్యతలను పిచ్చుకలు కాపాడుతుంటాయి. అటువంటి పిచ్చుకలు లేకపోవడం అంటే పర్యావసానం అనుభవించాల్సిందే. అందుకే శాతం మనం చూసే వాటిల్లో ఇంటి పిచ్చుకలే ఎక్కువ. దీని శాస్త్రీయ నామం పాసర్ డోమెస్టికస్. పాసిరడే కుటుంబానికి చెందిన పక్షి. ఈ ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో ఉంటుంది. పొడవు 16.5 సెంటీమీటర్ల వరకు ఉంటుంది. 24-42 గ్రాముల బరువు ఉంటుంది. ఆడ పక్షులు, యువ పక్షులు రంగులేని ఉదా రంగు, గోధుమ రంగులో ఉంటాయి. మగ పక్షులు కాంతివంతమైన నలుపు, తెలుపుతో కూడిన గోధుమ రంగు మచ్చలతో కూడి ఉంటాయి. పూర్వపు రోజులలో సాధారణంగా పిచ్చుకలు ఇంటి కప్పుల కింద, పెంకులు అడుగు భాగంలో 90 శాతం ఇళ్లలోనే గుళ్ళు నిర్మించుకునేవి. ఆడ, మగ పిచ్చుకలు కలిసి జీవనం సాగించుకోవడానికి నిర్ణయించుకున్న తరువాత గూడు నిర్మించుకుంటాయని తెలుస్తుంది. రెండు కలిసి కష్టపడి గూడ నిర్మించుకొని గుడ్లు పెట్టి పిల్లలు ఎదిగే వరకు కలిసి బాధ్యత వహిస్తాయి. ఇవి ఎక్కువగా ధాన్యం తింటాయి. ప్రతి ధాన్యం గింజను మలుచుకొని బియ్యం గింజలను మాత్రమే తింటాయి. అవి తినే సమయంలో చూస్తే అత్యంత వేగంగా, గమ్మత్తుగా తినడాన్ని గమనించవచ్చు. ప్రపంచంలో 40 రెక్కల పిచుకలు ఉన్నట్లు పరిశోధనలో తేలింది. అయితే అనేక దేశాల్లో ఈ జాతి అంతరిస్తుంది. జీవనశైలిలో పెనువేగంగా వచ్చిన మార్పే పరిణమించింది. పిచ్చుక జాతి అంతరించనుంది. శరవేగంగా పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో పండ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి వల్లనే పిచ్చుకలు అంతరించిపోవడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. సెల్యులర్ టవర్ల నుండి మెరుగుపడే అయస్కాంత తరంగాలు ఆ జాతికి ముప్పుగా పరిణమించాయి. కృత్రిమమైన పిచ్చుక గూళ్లను ఏర్పాటు చేయడం ద్వారా పిచ్చుక జాతిని కొంతవరకు సంరక్షించవచ్చని శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. సాధారణంగా పిచ్చుకలు మన దేశంలోనే కాకుండా ఆసియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాల్లో కూడా కనిపిస్తాయి. భారతదేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిస్సాలో విరివిగా కనిపిస్తుంటాయి. బంగారు పిచ్చుక అనేది తెలుగు జాతీయాల్లో ఒక పదం. అయనకేమండి బంగారు పిచ్చుక అనడం తెలుగు వారికి బాగా పరిచయమే. చంద్రమోహన్, విజయనిర్మల నటించిన ఓ చలనచిత్రాన్ని బంగారు పిచ్చుక పేరుతో తీయడం జరిగింది. 58-61 సంవత్సరాల మధ్య చైనాలో వచ్చిన కరువుతో నాలుగు కోట్లకు పైగా ప్రజలు మరణించారు. తీరా పరిశోధిస్తే పిచ్చుకలు లేకపోవటమని తేలింది. పిచ్చుకలు ధాన్యాన్ని తినడంతో పాటు పంటలను నాశనం చేసే కీటకాలను కూడా తింటాయి. ఇవి లేకపోవడంతో పంటలకు చీడపట్టి, తెగులు సోకి ధాన్యం దిగుబడి తగ్గింది. అది క్రమక్రమంగా పెరగడంతో తిండి లేక ప్రజలు చనిపోయారు. వాస్తవాలు గ్రహించిన అక్కడి ప్రభుత్వం ఆ తరువాత రష్యా నుండి పిచ్చుకలను దిగుమతి చేసుకున్నట్లు చరిత్ర చెబుతుంది.

**పిచ్చుక చాలా చిన్నది**

పిచ్చుక చిన్నది అయినా దీన్ని బతికించుకోవాలి. పిచ్చుకంత లేవు.. ఎందుకురా అలా ఎగురుతావనేది పల్లెటూరి జీవితంలో ఊతపదం మర్చిపోయే పరిస్థితి వచ్చిందనే చెప్పొచ్చు. ఎందుకంటే పిచ్చుకే పిచ్చుకంతయి పోయింది. కాబట్టి అందరం కలిసి పిచ్చుకలను బతికించుకోవాల్సిన అవసరం ఉంది. పిచ్చుకలు సాధారణంగా మన ఇళ్లలోనే తిరుగుతాయి. మనుషుల మధ్య కలివిడిగా తిరుగుతుంటాయి. మనలో ఒకటిగా కలిసిపోతాయి. కానీ ఇల్లు ఇరుకై వాకిలి, పెరడు హరించిపోయి చెట్లు కనిపించకుండా పోతూ ఉంటే ఈ పిచ్చుక ఎక్కడ బతుకుతుంది. బతకడానికి దారి లేకపోతే పెరుగుతున్న సాంకేతిక విప్లవం కారణంగా పిచ్చుక పూర్తిగా కనుమరుగై భావితరానికి "పిచ్చుక బొమ్మ" ను చూపించి ఈ పిచ్చుక అనే పక్షి మన ఇళ్లలోనే తిరిగేదని చెప్పాల్సిన పరిస్థితి రాకుండా, ఉన్న పిచ్చుకలు నైనా బతికించుకోవలసిన అవసరం అందరిపై ఉందనేది మాత్రం వాస్తవం.

**ఉమ్మడి రాష్ట్రంలో కనిపించే కొన్ని పిచ్చుకలు** (ఇప్పుడు అంతలా లేవు)

ఉమ్మడి రాష్ట్రంలో ఇంటి పిచ్చుక, వెదురు పిచ్చుక, కొండ పిచ్చుక, చెరుకు పిచ్చుక, ఊర పిచ్చుక, పొద పిచ్చుక, పేద పిచ్చుక, బంగారు పిచ్చుకలు కనిపించేవని పూర్వీకులు చెబుతున్నారు.

**పిచ్చుకలు హరించిపోవడానికి కారణం**

పిచ్చుకలు హరిచిపోవడానికి ఇంధన కాలుష్యం, గృహ నిర్మాణంలో మార్పులు, పెరుగుతున్న అపార్ట్మెంట్ కల్చర్, సాంకేతిక మార్పులతో పాటు సెల్ టవర్ల నిర్మాణం ( వీటి తరంగాలతో తగ్గుతున్న ఉత్పత్తి) అని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

**పిచ్చుకపై బ్రహ్మాస్త్రం**

తెలుగు జాతీయాల్లో పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అనే పదం ఉంది. అంటే పిచ్చుక అల్పప్రాణి. తక్కువ బలం ఉన్న ప్రాణిపై అవసరం లేకపోయినా అతిపెద్ద బలాన్ని ఉపయోగించడం అనే అర్థంలో దీన్ని వాడుతుంటారు.

ఏదిఏమైనా ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ పిచ్చుకలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో ఆ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ చికిత్స నిమిత్తం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తరపున ప్రణాళిక రూపొందించాలని డీఎంహెచ్ వో ను ఆదేశించారు. ముందుగా జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్ పోర్ట్, పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రహదారి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న గుర్తించిన ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు గల కారణాలపై అధ్యయనం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా తక్షణమే ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉన్న దగ్గరి రహదారులు, హాస్పిటల్లను ఎంపిక చేయాలని తెలిపారు. అదేవిధంగా అంబులెన్స్ లు, ట్రామా కేంద్రాలపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రమాదాలు సంభవించకుండా రహదారులపై సైన్ బోర్డులతో పాటు, రేడియం స్టిక్కర్లు, జీబ్రాలైన్లు, స్టాపేజీలు వంటి వాటిని



ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో మోటార్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశంలో గుర్తించి వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని. కళాశాలలు , పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకుగాను ప్రమాద దృశ్యాల వీడియోలు, ఫోటోలు ద్వారా ప్రమాదానికి గురైన వారి తల్లిదండ్రులు పడే వేదనను విద్యార్థులకు అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. జిల్లాలోని రహదారుల్లో ప్రమాదకరమైన మలుపుల వద్ద అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. రహదారులు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి వాటిని తొలగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్ళలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటుచేసిన పోల్స్ మాదిరిగానే జిల్లావ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారుల్లో ప్రమాదాల నియాత్రలకు అన్ని శాఖలు సమన్వయంగా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి వెలసిరి వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, డిసిహెచ్ ఓ రవిబాబు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జెకె ఓసి, కెఓసి ఉత్పత్తి, ఉత్పాదకతను సకాలంలో పూర్తి చేయాలి

- ఏరియా జియం వీసం. కృష్ణయ్య



**ఇల్లందు, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని జెకె ఓసి, కెఓసి ఉత్పత్తి, ఉత్పాదకతను సకాలంలో పూర్తి చేయాలని ఏరియా జియం వీసం. కృష్ణయ్య సూచించారు. బుధవారం స్థానిక వైసిఓఏ క్లబ్ లో ఇల్లందు ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ నూతన జెకె ఓసి నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న పర్యావరణ పనులు సకాలంలో పూర్తి చేసి ఉత్పత్తి, ఉత్పాదకత జరిగేలా చూడాలన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన పనులకు సంబంధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యస్ఓటూ జియం రామస్వామి, ఏజీయం ఐఈడీ గిరిధర్ రావు, ఏరియా ఇంజినీరు ఆర్వీ నరసింహరాజు, కోయగూడెం పిఓ. గోవిందరావు, జెకె ఓసీ పిఓ కృష్ణ మోహన్, డిజియం (పర్సనల్) జీవి. మోహనరావు, డీజియం. (సివిల్) రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

# సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పై ఈడి కేసులు పెట్టడం సరికాదు

- కిసాన్ ఖేత్ నేషనల్ కోఆర్డినేటర్ : ఖాజా గౌస్ మోహినుద్దీన్



**ఇల్లందు, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఈడి కేసులు పెట్టడం సరికాదని ఆల్ ఇండియా అనుబంధ కిసాన్ ఖేత్ నేషనల్ కోఆర్డినేటర్, ఐఎనట్రీయూసీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి, ఆల్ ఇండియా అసంఘటిత ఉద్యోగులు, కార్మికుల కాంగ్రెస్ (కెకెసి) రాష్ట్ర ఉపా ధ్యక్షుడు యండి. ఖాజా గౌస్ మోహినుద్దీన్ అన్నారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షలో భాగం గానే బిజెపి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై ఈడీ కేసులు బనాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాలలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ బిజెపి ప్రభావం తగ్గే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ పార్టీని ఇబ్బందులకు గురి చేయాలని చూడడం ఏమిటని ప్రశ్నించారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలలో బిజెపి బలం కోల్పోతున్నట్లు గ్రహించి కక్ష సాధింపు రాజకీయాలకు బిజెపి పాల్పడుతుందని ఆరోపించారు. బిజెపి ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ పార్టీ ఆధరణను తగ్గించలేరన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని, రానున్న ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ధీమా వ్యక్తం చేశారు.

# డంపింగ్ యార్డ్ ను తరలించి గోదావరి పవిత్రతను కాపాడాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏంబి నర్సారెడ్డి
- సిపిఐఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్థానిక సమస్యల సర్వే



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణం లో సేకరించిన వ్యర్థాలు మొత్తం తీసుకువచ్చి గోదావరి ఒడ్డున వేయడంతో గోదారి నీరు కలుషితమై హానికరంగా తయారవుతుందని పంచాయతీ అధికారులు వెంటనే డంపింగ్ యార్డ్ ను గోదారి కరకట్ట వద్ద నుండి తరలించి నదీ పవిత్రతను కాపాడడంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలో నివాస ప్రాంతాలలో స్థానిక సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల సర్వే బుధవారం ఒకటో వార్డు రామాలయం ఏరియా ప్రాంతంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పలు స్థానిక సమస్యలను స్థానిక సమస్యలను సిపిఐ బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా పిలవబడుతున్న భద్రాచల సీతారాముల దేవాలయం దాని పరిసర ప్రాంతాల లో ఉన్న ప్రజలు రాత్రులు నిద్రపోయే పరిస్థితి కూడా లేదని, విపరీతమైన పొగతో ఇల్లు మొత్తం కూడా పొగతో నిండిపోయి ఊపిరి ఆడక ఊపిరితిత్తులు పాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నివసించే కొంతమందికి క్యాన్సర్ కూడా వచ్చినదని ఊళ్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు అన్నిటిని కాల్చడం వల్ల క్యాన్సర్ కారకాలు ఎక్కువ అవుతున్నాయని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని విమర్శించారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి సుందరయ్య నగర్ లో ఏర్పాటు చేసిన అధునాతనమైన డంపింగ్ యార్డ్ ను నిర్మించి తడి చెత్తను పొడి చెత్తను వేరుచేసి వాటిని ఫైరింగ్ పిల్స్ గా మారుస్తున్నామని చెప్పినప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కానందువలన ఇప్పటికీ రామాలయ పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి ఒకటి, రెండు, మూడు, నాలుగు, వార్డుల ప్రజలు విపరీతమైన బాధలు పడుతున్నారని అన్నారు. గ్రామపంచాయతీకి ఇన్చార్జిగా ఉన్నటువంటి, పిఓ , దీనిపై దృష్టి సారించి గోదావరి నదిలో రామాలయ పరిసరాలలో భద్రాచలంలోని వ్యర్థపదార్థాలు అన్నివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భద్రాచలంలోనీ మురుగు నీరు యాత్రికులు స్నానాలు చేసే రేవు వద్ద కలవడంతో ఎంతో భక్తి భావంతో వచ్చే యాత్రికులు మురుగునీటిలో స్నానాలు ఆచరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని నర్సారెడ్డి అన్నారు. వెంటనే ఆ డ్రైనేజీ వాటర్ ని కిందకి మళ్ళించాలని గోదావరి నీటిలో కలవకుండ చర్యలు తీసుకోవాలని లేకపోతే స్థానిక ప్రజలను సమీకరించి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ధనకొండ రాఘవయ్య ,శాఖ కార్యదర్శి ,ఆది, వెంకన్న, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మోడెం వంశీని అభినందించిన ఏఎస్పి విక్రాంత్ కుమార్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి** : మే 5 నుండి 12 వరకు డేహ్రాడూన్ లో జరిగే ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు తెలంగాణ తరుపున ఎంపికైన సందర్భంగా ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ మోడెం వంశీని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ అందించారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మాస్టర్ టీం ఛాంపియన్షిప్ ను సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు కైవసం చేసుకున్నందుకు కొనియాడారు. కాగా భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ లో కోచ్ జివి రామిరెడ్డి దగ్గర శిక్షణ తీసుకున్న 72 సంవత్సరాల డివి శంకర్రావు గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని కూడా వైద్యుల పర్యవేక్షణ లో మాస్టర్ 4 విభాగంలో 83 కేటగిరీలో 60 కేజీల బరువెత్తి బంగారు పతకం సాధించినందుకు ఏఎస్పీ మెచ్చుకున్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ తన తండ్రి కూడా నాలుగు సంవత్సరాల క్రితం గుండెకు వాల్వ్ రీప్లేసెమెంట్ అయ్యి విశ్రాంతి తీసుకుంటున్న విషయం గుర్తు చేస్తూ, డీవీ శంకర్రావు సాధించిన విజయాన్ని తన తండ్రి తో పంచుకుంటాను అని ఈ సందర్భంగా తెలియచేసారు. బైపాస్ సర్జరీ చేయించుకున్న వ్యక్తితో గోల్డ్ మెడల్ కొట్టించిన జిమ్ కోచ్ జివి రామిరెడ్డిని, అసోసియేషన్ సభ్యులను కూడా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ జివి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డా. శివరామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు ఘనంగా కల్యాణం



**భద్రాచలం, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం బుధవారం వైభవం గా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్ర భాతం పలికి ఆరాధన, ఆర గింపు, సేవాకాలం, నిత్యహో మాలు, నిత్యబలిహరణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం బేడామండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

# జీఓ నెంబర్ 76ను పునరుద్ధరించాలని వినతి



**ఇల్లెందు, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** ఇండ్ల క్రమబద్ధీకరణ జీఓ నెంబర్ 76ను పునరుద్ధరించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఇల్లందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టియుసిఐ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఇల్లందు పట్టణ కార్యదర్శి పాయం వెంకన్న మాట్లాడుతూ సింగరేణి ప్రాంతాలలో ఇళ్ల పట్టాలు గానీ రిజిస్ట్రేషన్ లేని పరిస్థితి నుండి గత ప్రభుత్వం జీఓ నెంబర్ 76 ద్వారా ఇల్లందు పట్టణంలోని ఇళ్ల యజమానులు ఆన్లైన్ చేసుకొని కొంతమంది పట్టాలు పొందినట్లు తెలిపారు. ఇంకా మిగిలిపోయిన వారు చాలామంది డిడీలు చెల్లించారని, వారికి క్రమబద్ధీకరణ పట్టాలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. జిల్లా అధికారులు, ఎమ్మెల్యే జోక్యం చేసుకొని 76 జీఓ కి దరఖాస్తు చేసుకున్న వారందరికీ రెవెన్యూ ఇళ్ల పట్టాలు, ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా జిల్లా మంత్రుల ద్వారా ముఖ్యమంత్రి తో మాట్లాడి జీఓ 76ను పునరుద్ధరించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు, రంజాన్, వేముల గురునాథం, కొత్తపల్లి రఘు, టియుసిఐ ఇల్లందు ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోషణ పక్వాడ కార్యక్రమం



**టేకులపల్లి, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** మండలం బొమ్మనపల్లి సెక్టార్ బిల్లుడు తండ గ్రామ పంచాయతీ లోని బిల్లుడు తండ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ భాగంలో బుధవారం టేకులపల్లి ప్రాజెక్టు సిడిపిఓ మంగతార ఆధ్వ ర్యంలో పోషణ పక్వడ కార్యక్రమం నిర్వహించారు. సీమంతాలు, అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ యశోదమ్మ, అంగన్వాడి టీచర్స్ సరోజ,విజయ లక్ష్మీ, పద్మ, విజయ, రమణ శ్రీ, రోజ, సరోజ,అంగన్వాడి వర్కర్లు నీల, బద్రి పాల్గొన్నారు.

## ఆడపిల్లల హాస్టల్ లో పురుషుల సిబ్బందిని తీసివేయాలి

- పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల ఇతర వసతి గృహాలలో పనిచేస్తున్న పురుష ఉద్యోగులను, సిబ్బందిని తక్షణమే తీసివేయాలని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం మండలం రామ చంద్రుని పేట ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి ని ఒక సెల్ఫీ వీడియో విడుదల చేసింది. ఆ వీడియోలో హై స్కూల్ హెడ్మాస్టర్ గా పనిచేసే వ్యక్తి కోయ సామాజిక వర్గానికి చెందిన ఆడ పిల్లలను అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇక్కడ పనిచేసే కోయవారిని పనిలో నుంచి తీసివేసేందుకు కూడా కుట్రలు పన్నుతున్నాడని ఆ విద్యార్థిని సెల్ఫీ వీడియోలో చెప్పడం జరిగింది. హాస్టల్లో జరుగుతున్న వివక్షకు లంబాడి సామాజిక వర్గ వ్యక్తులు చేసే దాడులకు నిదర్శనమని ఆయన అన్నారు. హాస్టల్లో అందరూ కలిసిమెలిసి చదువుకొని ఎటువంటి భేదాలు లేకుండా ఉండేందుకు తగు చొరవ తీసుకోని విద్యాభివృద్ధిలో నేర్పాల్సిన గురువు మనుషుల మధ్య వైశ్యమ్యాలు రెచ్చగొట్టి తమ సామాజిక వర్గ విద్యార్థినీలతో ఇబ్బంది పెట్టించడం దుర్మార్గమైన చర్యఅని అటువంటి వ్యక్తిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జి ఓ ఎం ఎస్ 1274 ప్రకారం గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల ఇతర బాలికల వసతి గృహాలలో పురుష ఉద్యోగస్తులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో పనిచేయడానికి వీలు లేదని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం జీవో విడుదల చేసినా కొంతమంది అధికారుల నిర్లక్ష్య పూరిత వైఖరి కారణంగా ఇటువంటి సంఘ టనలు జరుగుతున్నాయని, తక్షణమే ఆడపిల్లల వసతి గృహాల్లో పనిచేసే మగ ఉద్యోగస్తులను, సిబ్బందిని తక్షణమే తొలగించాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోను ఆయన కోరారు.

## వరంగల్ సభ జయప్రదం కోసం కర్రమిల్లులో పనిచేసిన బీఆర్ఎస్ నేతలు



**భద్రాచలం, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి:** వరంగల్ లో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు నిధుల సమీకరణ కోసం భద్రాచలం పట్టణంలో రాందాసు సామిల్లులో బీఆర్ఎస్ నాయకులు బుధవారం కూలీ పనులు చేశారు. వరంగల్ బహిరంగ సభ జయప్రదం కావాలని కోరుతూ ఆ సామిల్లు యజమాని తుమ్మలపల్లి ధనేశ్వరరావు కొంత నిధిని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, నాయకులు కొల్లం జయ ప్రేమ్ కుమార్, అంబటికర్ర కృష్ణ, చిట్టిమల్ల అనిల్, కొలిపాక శివ, ఎస్ కె. అబ్దుల్ ఖాదర్, నాగసాయి, మహిళా నాయకులు సలోమి, తెల్లం రాణి తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ను శాలువాతో సన్మానం



**టేకులపల్లి, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి మండలం పోలీస్ స్టేషన్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై ఏ. రాజేందర్ ను కాంగ్రెస్ పార్టీ కోయగూడెం టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నల్లవెల్లి నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రావూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివితే ఇష్టమైన జీవితాన్ని పొందవచ్చు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల





**పాల్వంచ (రూరల్ ), ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి:** విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఇష్టమైన జీవితం మన చేతిలోకి వస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపక బృందం విశాలమైన తరగతి గదులు క్రీడా ప్రాంగణం అన్ని వసతులు కలిగి ఉండడం వలన కళాశాలలో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని అభిప్రాయ పడ్డారు. విద్యార్థులు కేవలము చదువు పైన కాకుండా క్రీడల పైన కూడా ఆసక్తిని కలిగి ఉండాలని తద్వారా విద్యార్థుల్లో శారీరకంగా మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉంటారని ఆయన అన్నారు. విద్యార్థులు ఈ మూడు సంవత్సరాలను కష్టపడి చదివి కళాశాలకు తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కలెక్టర్ విద్యార్థులను కోరారు. మూడు సంవత్సరాల కష్టపడితే 30 సంవత్సరాల సుఖపడవచ్చు అని ఒకవేళ మూడు సంవత్సరాలు ఎంజాయ్ చేశారంటే 30 సంవత్సరాలు కష్టపడతారని తెలుపుతూ జిల్లా కలెక్టర్ తన స్వీయ అనుభవంలో జరిగినటువంటి కొన్ని సంఘటనల గురించి విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ మాట్లాడుతూ,క ళాశాల అటానమస్ హోదా పొందిన తర్వాత మొట్ట మొదటిసారిగా పరీక్షలు నిర్వహించి సకాలంలో మూల్యాంకనం చేసి ఫలితాలను కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మరొక అతిథి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వై చిన్నప్పయ్య మాట్లాడుతూ ఈ కళాశాలలో నేను పనిచేసిన కాలంలో ఈ కళాశాలకు నాయక్ ఏ గ్రేడు వచ్చిందని కళాశాలలో అభివృద్ధి చేయడంలో నా వంతు కృషి ఎంతగానో ఉందని దానికి సహకరించిన ఇక్కడ అధ్యాపక బృందానికి అధ్యాపకేత్ర బృందానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. నేను నాటినటువంటి మొక్క ఈనాడు ఒక వృక్షం అయ్యిందని రాబోయే కాలంలో మహావృక్షమై ఇక్కడ ఉన్నటువంటి విద్యార్థులకు ఫలాలను అందివ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ సందర్భంగా అటానమస్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వేముల కామేశ్వరరావు మాట్లాడుతూ.. అటానమస్ ఏర్పాటు అయిన తర్వాత చేయవలసినటువంటి కమిటీలను అన్నిటిని ఏర్పాటు చేసుకుని వివిధ యూనివర్సిటీ ప్రొఫెసర్ల చేత పేపర్లను తయారు చేయించి పరీక్షలు నిర్వహించిన తర్వాత వాటిని వివిధ సబ్జెక్ట్ ఎక్స్పెక్ట్ల చేత మూల్యాంకనం చేయించి విద్యార్థులకు అనుకున్న సమయానికంటే ముందుగానే ఫలితాలను విడుదల చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫలితాలను విడుదల చేసినటువంటి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ని ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె మాధవి, డాక్టర్ టి అరుణకుమారి, డాక్టర్ కే కొండలరావు విజయ ప్రసాద్, డాక్టర్ శెట్టి స్వరూపారాణి, పొట్లపువ్వు శ్రీనివాస రావు, పారేల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, డాక్టర్ ఎన్ శ్రీదేవి, లీల, దీపిక, విమల, కావ్య కరిమ, పర్వీన్, హారిక, ధర్మారావు, ఈ శ్రీను, రమేష్, కరుణాకర్, కమలాకర్ భాను, ప్రవీణ్, పవన్ కుమార్ కాళేశ్వరరావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఎంసీ కాలనీలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



**భద్రాచలం, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో బుధవారం సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో 20వ తేదీవరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదాలు జరిగిన సమయంలో వాటిని ఎలా నివారించాలో మాక్రెల్ ద్వారా అవగాహన కల్పించారు. ఎల్పీజీ గ్యాస్ లీకేజీ, ఎలక్ట్రిక్ షార్ట్సర్క్యూట్ తదితర ప్రమాదాలు ఎలా నివారించాలో ప్రాక్టికల్ గా సిబ్బంది చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కాలనీ వాసులతో పాటు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## మండల యువకుడికి గిన్నిస్ లో చోటు



**టేకులపల్లి, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని సంపత్ నగర్ గ్రామం వాసి అయిన కుడితేటి రమేష్ తండ్రి పాపులు గిన్నిస్ బుక్ రికార్డ్ లో చోటు దక్కింది. కుడితేటి రమేష్ బృందం సంగీతంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. హైదరాబాద్ హోలెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వాహకుల చేతుల మీదుగా సోమవారం మెడల్ అందు కున్నారు. కుడితేటి రమేష్ సంగీతం అంటే మక్కువ హోలెల్ మ్యూజిక్ స్కూల్ ప్రోత్సాహంతో క్రిస్టియన్ గీతాలపై ప్రపంచ స్థాయిలో జరిగిన ఆన్లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో అతను పాల్గొన్నారు. కీబోర్డు వాయిస్తున్న సంగీత కళాకారుల బృందం గంటలో 1046 వీడియోలు అప్లోడ్ చేశారు. ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఈ బృందంలో కుడితేటి రమేష్ ఉన్నారు. పాస్టర్ ఆగస్టిన్ చేతుల మీదుగా మెడల్ తోపాటు సర్టిఫికెట్ అందుకున్నారు. పట్టుదలతో సంగీతం నేర్చుకున్నానని, గిన్నిస్ వరల్డ్ రికార్డుతో అరుదైన గౌరవం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు.

## బిఎస్ఎన్ఎల్ నెట్ ప్రారంభం

**ఇల్లందు, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి:** పట్టణంలోని జెకె కాలనీలోని లక్ష్మణ్ కేబుల్ అండ్ బ్రాడ్ బ్యాండ్ సర్వీస్ లో బుధవారం బిఎస్ఎన్ఎల్ నెట్ సర్వీస్ ను బిఎస్ఎన్ఎల్ డిజియం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన నెట్ సేవలు అందించేందుకు బిఎస్ఎన్ఎల్ ప్రైవేటు వారికి నెట్ సిగ్నల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తక్కువ ఖర్చుతో వినియోగదారులకు నాణ్యమైన నెట్, చానల్స్ రావడం జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు జెటిఓ మనీష్, డిఈ సుభాష్, జెడిఈ సక్రు నాయక్, ఏజియం సుదీర్, ఎస్డిఈ రమేష్, బిఎస్ఎన్ఎల్ సిబ్బంది, లక్ష్మణ్ కేబుల్ అండ్ బ్రాడ్ బ్యాండ్ సర్వీస్ నిర్వాహకులు రాములు, మహేందర్, కేబుల్ ఆపరేటర్లు జె. కుటుంబరావు, బాల, నాగేశ్వరరావు, కిరణ్, రాజేష్, గోపి, వేణు, శ్రీను, ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, గందె సదానందం, వడియాల చిట్టి బాబు, ఊరకొండ ధనుంజయ్, బిఆర్ఎస్ నాయకుడు వల్లాల నర్సయ్య పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు బాసటగా







- నష్టపరిహారం అందించేందుకు అధికారులతో మాట్లాడతా... బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ , మాజీ ఎమ్మెల్యే మెచ్చా

**అశ్వారావుపేట, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి:** మండలంలోని పాలగుంపు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు బాసటగా నిలిచారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాలకు బియ్యం, వంటసామాగ్రి ,నిత్యవసర సరుకులు, దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిలువ నీడ లేకుండా సర్వం కోల్పోయిన కుటుంబాలను త్వరగా నష్టపరిహారం విధంగా అధికారులతో మాట్లాడతానన్నారు. ప్రభుత్వం కూడా వీరి పట్ల దాతృత్వ భావంతో ఉంటూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి వెంటనే ఇల్లు నిర్మించే ఇవ్వాలన్నారు.ముందుగా సున్నం బట్టి గ్రామంలోని సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాకలగూడెం గ్రామంలో వెంకటేశ్వరరావు అనే రైతు 4 ఎకరాల్లో వేసిన మునగ పంట ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో బాధిత రైతును పరామర్శించి అధికారులు రైతును ఆదుకోవాలని వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకన్నబాబు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంకా ప్రసాద్ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి ,తాడేపల్లి రవి, బిర్రం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రాజులు, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పు ఈ స్వామి

- ఘనంగా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం





**అశ్వారావుపేట, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు చల్లపల్లి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షా సూత్రధారణ, అఖండ దీపారాధన, సిద్ధి బుద్ధి సమేత లక్ష్మీగణపతి విగ్రహాలకు పంచామృతాభిషేకం, గరిక పూసలతో సహస్ర నామార్చన, కుంకుమార్చన, లక్ష్మీ గణప తి హోమం, నీరాజన మంత్ర పుష్పాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ప్రసాదాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే విలవేల్పుగా లక్ష్మీ గణపతి స్వామి వెలుగుందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వేద పురోహితులు ఘండికోట భరద్వాజ శర్మ ,యశస్వి, ఆలయ అధ్యక్షులు బాలేపల్లి నాగరాజు, పలువురు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

**టేకులపల్లి, ఏప్రిల్ 16,ప్రజాజ్యోతి :** ఇద్దరూ పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిర నుండి కుటుంబ కలహాలతో తల్లి ఇంటికి పది రోజుల క్రితం ధరావత్ కవిత ఇద్దరు కొడుకులతో వచ్చారు అని తెలిపారు. ఇంట్లో ఎవరికి చెప్పకుండా 15వ తేదీ రాత్రి సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిపోయింది అని తెలిపారు. చుట్టు పక్కల వెతకగా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో టేకులపల్లి పోలీస్ స్టేషన్లో కవిత తల్లి అయినా భానోత్ భామిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టేకులపల్లి ఎస్సై ఏ. రవీందర్ తెలిపారు.

# కర్షకులపై ప్రకృతి కన్నెర్ర

- పెనుదుమారం...తీవ్ర విషాదం
- అర్ధరాత్రి అకాలవర్షం







**అశ్వారావుపేట, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి:** కర్షకులపై కనికరం లేకుండా ప్రకృతి కన్నెర్ర చేసింది. అనేక పంటలను నేలమట్టం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.కర్షకులపై అర్ధరాత్రి గాలి దుమారంతో వచ్చిన అకాలవర్షం కడగండ్లు కుమ్మరించింది. ఎక్కడకక్కడ మామిడికాయలు రాలిపోవడంతో పాటు అనేక చోట్ల చెట్లు సైతం విరిగి నేలను తాకాయి. మంగళవారం అర్ధరాత్రి అకాల వర్షానికి తోడు వచ్చిన గాలి దుమారానికి పలు ఇండ్ల పై కప్పులు సైతం లేచిపోయి పరిస్థితి దారుణంగా తయారైంది. నియోజకవర్గ కేంద్రంలోని అటెండర్స్ కాలనీకి చెందిన జ్యోతి అనే మహిళ అర్ధరాత్రి వచ్చిన గాలి దుమారానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంటి పై కప్పులు ఫ్యాన్లతో సహా లేచిపోయి పక్కకు పడడంతో పెను ప్రమాదం తప్పింది. రూ.3 లక్షలు ఖర్చుపెట్టి రేకుల షెడ్డు నిర్మించుకున్నామని ఇంతలో గాలి దుమారంతో కూలిపోయిందని అవేదన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఇందిరా కాలనీ రామాలయం పై పెద్దచెట్టు పడింది. అనేక చోట్ల హోర్డింగులు సైతం కింద పడిపోయాయి

## అంగన్వాడీ కేంద్రంలో శ్రీమంతం, అన్నప్రసన్న వేడుకలు



**ఇల్లందు, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** పట్టణంలోని 16వ వార్డు పరదేశి బస్తీ 1 అంగన్వాడీ సెంటర్ లో ఐసిడిఎస్ సిడిపిఓ అరుణకుమారి బుధవారం గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ అరుణకుమారి మాట్లాడుతూ ఈనెల 8 నుండి 22 వరకు పోషణ పక్షోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సూపర్వైజర్ రోహిణి, అంగన్వాడీ టీచర్లు వి. ధనలక్ష్మి , మాధవి, ఆయా సీతారత్నం, ఏఎన్ యం, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామికవాదులు మోడీ విధానాలను తిప్పి కొట్టాలి

- ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్

**ఇల్లందు, ఏప్రిల్ 16, ప్రజాజ్యోతి :** ప్రజాస్వామికవాదులు మోడీ విధానాలను తిప్పి కొట్టాలని ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్ కోరారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు చర్చలో పార్లమెంట్ సాక్షిగా బిజెపి అబద్ధాలు ఆడినట్లు విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎన్డీఏ ప్రభుత్వం కాలరాస్తుందని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారంతో వక్ఫ్ బోర్డుపై నిందలు వేయడం సరి కాదని, మోడీది కుటిల నీతి అని ఆరోపించారు. ముస్లింల హక్కులను కాలరాయడమే బిజెపి లక్ష్యమని విమర్శించారు. పార్లమెంట్ ఉభయ సభల చర్చలో భాగంగా బిజెపి దాని మిత్రపక్షాల మంత్రులు, ఎంపీలు మాట్లాడిన తీరు సభ్య సమాజానికి తలవంపుగా భావిస్తున్నామన్నారు. దేశంలో దేవాదాయ భూములను ఆస్తులను పరిరక్షించడానికి ఉన్న విధంగా ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ భూములను పరిరక్షించడానికి ఒక బోర్డు అనాదిగా చట్టబద్ధంగా ఉందన్నారు. కేవలం ముస్లిం సమాజాన్ని అనుగదొక్కడానికే నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రగా భావిస్తున్నామని ఆరోపించారు. రాజ్యాంగం దేశంలోని పౌరులకు మతాలకు కల్పించిన హక్కులను హరించడం సరికాదని సూచించినందుకు భిన్నంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. మతోన్మాదంతో విర్రవీగుతున్నా నరేంద్ర మోడీ దేశంలో హిందూ మతం అనేది ఒకటే ఉండాలనే సిద్ధాంతంతో ముందుకు వెళ్తున్నారని అందులో భాగమే ఈ వక్ఫ్ సవరణ చట్టమని పేర్కొన్నారు. దేశంలో అన్నదమ్ముల మాదిరిగా కలిసిమెలిసి ఉంటున్న ప్రజల మధ్య చిచ్చు రేపడానికే ఇలాంటి చట్టాలు తీసుకువస్తున్నారని ఆరోపించారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకురావడంలో దురుద్దేశం దాగి ఉందన్నారు. వక్ఫ్ సవరణ చట్టంలోని 6 చట్టాల సవరణలను దాని ద్వారా జరిగే నష్టాలు అనేకం ఉన్నాయని, నరేంద్ర మోడీ విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ లాంటి వారికి ముస్లిం సమాజంతో పాటు సామాజిక భావాజాలం కలిగిన ప్రతి ఒక్కరు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈనెల 17న హైదరాబాద్ లో సిపిఐ రాష్ట్ర ఉప సంఘాల సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.

